కొత్త చోటైనా పాత మనుషులే

పద్మకి భర్త రాఘవరావు వచ్చి చెప్పినవార్త విన్న దగ్గరనించీ, సంతోషంతో మనస్సు రకరకాలుగా పురకలు వేస్తోంది.

ఎక్కువసేపు మనస్సులో నిలుపుకోలేక పక్కయింట్లో కాపరమున్న శ్యామల్ని పిల్చి, మావారికి ప్రమోషనుతో ట్రాన్స్‌ఫర్ అయిందో అనిచెప్పి, పమిటకొంగుతో మొహం తుడుచుకుంది. ఆ, ఇన్నేళ్ళ సర్వీస్‌వుండి ఇప్పటికి రావటం ఏమంత గొప్పకాదులే! మా బావ రాత్రే చెప్పాడు. మీ ఆయన్ని పంపేచోటికి అతన్ని వెళ్ళమంటే, నాకు ప్రమోషను వద్దు ఏమీవద్దు నన్ను ఇక్కడినించి కదపవద్దని బతిమాలుకున్నాట్ట అని అక్కసు వెళ్ళబోసింది, శ్యామల. ఎందుకు చెప్పేనా ? అని మనస్సు చివుక్కుమని, వస్తానంటూ లోపలికి వెళ్ళిపోయింది పద్మ. రాఘవరావు స్నేహితులు ఒకరొకరే వచ్చి సంతోషాన్ని వెళ్ళబోస్తున్నట్టు మాట్లాడి, పార్టీ ఎప్పుడంటూ కాఫీ కప్పులు ఖాళీచేస్తున్నారు.

క్లబ్‌కి వెళ్ళాలన్న ఆత్రంతో ఇంటికి వచ్చేవాళ్ళమీద విసుకుకొంటోంది పద్మ. చూడు, ఈ నాలుగురోజులు వచ్చేవాళ్ళని భరించటం తప్పదు, కనుక ఎవర్నయినా వంటకి పెట్టరాదూ ? అని రాఘవరావు పద్మని సముదాయిస్తూ అన్నాడు. మరే, మనంపిలిస్తే వద్దామని సిద్ధంగా కూర్చున్నారు వంట

వాళ్లు. మీ మాటలన్నీ ఇల్లాగే వుంటాయి అంటూ మళ్ళీ కాఫీతో కప్పులునింపి, రాఘవరావుకిచ్చి పంపింది.

ఎల్లాగో తెములుచ్చుకు క్లబ్బు ఆవరణలోకి చేరుకుంది పద్మ. వరండాలో వెలిగే దీపంకాంతి గేటుదగ్గర చేరేసరికి చీకటి కలుపుకుంది. హాల్లో దీపాలు అద్దాల తలుపులోంచి మసగ్గా కనపడుతున్నాయి. వేపచెట్లు తలలూపుతున్నాయి. ఎంతో నిశ్శబ్దంగావున్న హాల్లోంచి వక్కసారి చాలా కంఠాలు పై స్థాయిలో మొదలుపెట్టాయి ఘర్షణ.

గుమ్మంలో నిల్చుని అందర్నీ తెల్లబోయి చూస్తోంది పద్మ. పేకముక్కలు విసిరివేసినవి, బల్లలకిందకి చేరి దాక్కుం టున్నాయి. చెప్పి ఆనందిద్దామనుకున్నకోరిక ఆ వాతావరణం లోకి రాగానే మనస్సులోనే మరుగుపడింది. క్లబ్బు శక్రట్రీకి కమిటీ మెంబర్లకి మధ్య వివాదం ఎక్కువయింది. కొందరు పద్మదగ్గరకి వచ్చి చెప్పుకుంటున్నారు, ఎంత అన్యాయం జరి గిందో! పోనీ ఆ ఆట లేదు అనుకుని మళ్లీ కొత్తగా మొదలు పెట్టక పోయారా? అని పద్మ వాళ్లతో అనటం క్లబ్బు శక్రట్రీ విని—

మహా తీర్పు చెప్పావులే అంతా పకరకం జట్టుకనకనే నీ దగ్గర మొరపెట్టుకుంటున్నారు. వోర్చలేనిగుణాలు అని కం ఠము బిగపెట్టుకు ఫ్రూపిరితియ్యకుండా అనేసింది కసిగా క్లబ్బు శక్రట్రీ. కమిటీ మెంబర్లలో వకామె కొంగు దోపుకు కొద్దిగా ముందుకువెళ్లి మీరు చాలా అమర్యాదగా మాట్లాడారు. మొదట మా అందరికి అపాలజీ ఇచ్చితీరాలి, అని శక్రట్రీని గదమాయించింది. నాకు అవసరంలేదు ఇవ్వనని ఆమె, ఇచ్చి

తీరాలి అని ఈమె వాదన పెరిగి క్లబ్బు ప్రెసిడెంటుని పిలిపించే దాకా జరిగి ఆవిడ రాకతో ఇద్దరూ, రెండోవాళ్ళదే తప్పు అని తోచే సమర్థతతో చెప్పుకున్నారు. శెక్రట్రీని మీరు కొంచెం తొందరపడ్డారనిపిస్తోంది అని, ఎవరము సర్దుకున్నా పోయేది అని కమిటీ మెంబర్సుతో రాజీగా చెప్పింది ప్రెసిడెంటు. ఆవిడ అపాలజీ ఇచ్చితీరాలని అంతా గట్టి పట్టుపట్టారు. శెక్రట్రీ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, ఛీ, ఇంక ఈ క్లబ్బుకి శెక్రట్రీగా నేను వుండనని చెపుతూ అసలు అంతా పద్మనించే ఇంతవరకూ వచ్చింది. ఇవాళ ఆవిడ మొగుడుకి పెద్ద పదవి వచ్చిందనేగా మీరంతా ఆవిడదగ్గర మొరపెట్టుకోవటం, ఇన్నాళ్ళులేని మర్యాద వక్కసారి మీ అందరికీ పుట్టుకొచ్చింది. మా ఆయనకి వాళ్ళకీ వీళ్ళకీ చాకిరీలు చెయ్యటం, కూరలు మొయ్యటం రాదు, వస్తే ఆయనా ఆఫీసరయ్యేవారు అంటూ మొహం వికృతంగా తిప్పుకుంటూ అనేసింది శెక్రట్రీ.

పద్మ వుత్సాహం అంతా నీరుకారినట్టు అయింది. ఆరోజు లేచినవేళ ఎంత మంచిదో అని ముందు మురిసినంతసేపు పట్టలేదు. తన సంతోషం ఎవరితో చెప్పుకుందామన్నా వాళ్లే ఈర్ష్య వెళ్ళపొయ్యటంతో పద్మ సంతోషం దుఃఖంగా మారింది.

క్లబ్బు ప్రెసిడెంటు మాకు చెప్పనేలేదే మీ వారికి ప్రమోషను వచ్చినట్టు, అంటూ చాలా సంతోషం అని పద్మ వీపు చేత్తో రాస్తూ అబ్బే అల్లాకష్టపెట్టుకోకండి, ఆవిడ మాటలకేం, అయినా మీరు బొత్తిగా సభ్యత లేకుండా మాట్లాడారంటూ శెక్రట్రీని మందలించినట్లు మాట్లాడింది. పద్మ వాళ్ళ

అందరిదగ్గర సెలవుతీసుకు ఇంటికి చేరేసరికి రాఘవరావు సామాన్లన్నింటినీ మధ్యగాపోగు పెడుతున్నాడు. పద్మని చూడకుండానే ఏమిటీ ఇంతసేపు చెప్పుకోవాలా ఖబుర్లు అని అడిగాడు.

పద్మదగ్గరనించి సమాధానం రాకపోవటంతో వెనక్కి తిరిగి చూశాడు. ఏం? స్నేహితుల్ని విడిచి వెళ్లాలని విచారమా? చిత్రమే, మీ ఆడాళ్ళు వకచోట వుంటే వకళ్ల మీద వకళ్ళు చెప్పుకోవడమో, లేక తగూలు పెట్టుకు మాటలు మానుకోవడమే లేకపోతే, అందరికంటే అతీతులమన్నట్టు నోరు తెరచి ఎవరితోనూ మాట్లాడకుండా విడిగావుండటమో జరుగుతుంది. తీరా అందులో వక్కళ్లుదూరంగా వెళ్ళిపోతున్నారంటే కొందరి కళ్లయినా చెమ్మగిల్లుతాయి. అవునా? అంటూ పద్మ దగ్గరికివచ్చి వంచినతల పైకి ఎత్తి కళ్లల్లోకి చూశాడు రాఘవరావు.

అబ్బే అటువంటిదేమి జరగలేదు అంటూ కళ్లు తుడుచుకుని క్లబ్బులో జరిగినదంతా చెప్పింది పద్మ. ఆవిడ ఎల్లాగా ఏడుస్తోందిగా, ఇంక నువ్వు ఏడవకూడదు ఆవిడన్న వాటికి. సరే కానీ ఇంకోమంచివార్త మన డాక్టరు స్నేహితుడు వచ్చాట్ట. వాళ్ల చుట్టాలింట్లో వోవాటా ఖాళీ అయిందని, అది ప్రస్తుతం ఇంకాఎవరికీఇవ్వలేదనీఅన్నాట్ట.ఇతనేమంటాడంటేమనసామాన్లు లారీలో అతనితో పంపితే అతనే సర్దిస్తాడంటాడు. దానికే ఈ హడావిడి అని చెప్పాడు రాఘవరావు. అన్నింటికీ తొందరెక్కువ బాబూ మీకు. ముక్కూ మొహం ఎరగనివాడితో సామాన్లు పంపటమేమిటి? అని విసుక్కుంది పద్మ.

డాక్టరు ముక్కు ఎరుగుదుంగా అంచేత నాకేం భయం లేదు అన్నాడు రాఘవరావు, నవ్వుతూ. కొన్ని సామాన్లు తగ్గించాలి అనివకరు దూరంగా పెడితే ఇంకొకరు కావాలంటూ మధ్యకి చేరవేస్తూ, చాలాసేపు గడిపారు. డాక్టరు రాకతో ఇద్దరూ వకమాటికి వచ్చారు. సామాన్లతో లారీ బయలుదేరే సరికి తెల్లారవచ్చింది.

పెళ్ళివారు వెళ్ళిన ఇల్లులా బోరుమంటోంది. ఇంకా వెళ్ళేందుకు సావకాశంవున్నా, రెండురోజులు ముందే వెడదామని పద్మ పట్టుపట్టడంతో రాఘవరావు వప్పుకోక తప్పలేదు. మిగిలిన సామాన్లు డాక్టరింట్లో పెట్టి ఆరోజు బయలుదేరారు. డాక్టరు చుట్టానికి వీళ్ళని కలుసుకోమన్న వార్త ముందే తెలియపర్చటంతో, ఇల్లు వెతుక్కునే బాధ కొంత తగ్గిందికూడా. తెచ్చిన సామాన్లు పైకి చేర్చుకుంటూంటే పక్కవాటాల్లోంచి చూసేకళ్లు ఆశ్చర్యాన్ని వెళ్లబెడుతున్నాయి. పద్మని మేడపైకి పిల్చుకువెళ్లి వాళ్ల భాగం చూపెట్టాడు. ఇంత సామాను ఈ వాటాలో ఇముడుతుందా ? అని భయపడింది పద్మ. ఇల్లు చిన్నదయినా హంగులు చాలా వుండటంతో అన్నీ సర్దేసరికి ఇల్లు విశాలంగావున్నట్టే తోచింది. చాలాకాలంగా మర్చిపోయిన కూరల సంచీ రాఘవరావు చేతికి వచ్చింది. డాక్టరు స్నేహితుడు తరుచు వచ్చి యోగక్షేమాలు కనుక్కుని వెళ్ళటం కొంత సాయంగావున్నది. పద్మకీ, రాఘవరావుకీ ఏదో బెంగగానేవుంది. భాషతో కొంత ఇబ్బంది పడ్డా ఎల్లాగో అలవాటుపడాలని వకరికొకరు ధయిర్యం చెప్పుకుంటూ గడుపుతున్నారు. పద్మకి తలుపులు వేసుకు గదిలో కూర్చోటం, కిటికీ

లోంచి దూరంగా కనపడే కొండ లోయల్ని చూస్తూంటే కాలం జరిగి, పొద్దు జరిగి కొండ కిందకి దిగటం, రాఘవరావు వచ్చే అలికిడికి, తలుపులు తెరవటం నిత్యకృత్యాల్లో వకటిగా అయింది.

ఆ రోజు రాఘవరావు కూడా కొందర్ని తీసుకురావటం చూసి, పద్మకి ముందు కొంత ఆనందం కలిగింది. పద్మకి వచ్చిన వాళ్ళని ఫలానాఅని రాఘవరావు పరిచయంచేసి బట్టలు మార్చేందుకు లోపలి కెళ్ళాడు. అందులో కొద్దిగా వయస్సు మళ్ళిన ఆయన బట్టతల చేత్తో రాసుకుంటూ, మనం దూరంగా వుండబట్టి కానీ చాలా దగ్గరవాళ్ళంకాదూ ? అంటూ సంభాషణలోకి దిగాడు. రాఘవరావు అక్కడికి రావటంతో పద్మ వంటగదిలోకి వెళ్ళింది. పద్మ పళ్ళాల్లో ఫలహారాలు సర్దుతుంటే అంతా ఇల్లుచూస్తూ అక్కడికి చేరారు. మీకు ఇంత తొందరగా ఇల్లు ఎల్లాదొరికిందండీ అంటూ వుసూరుమన్నాడు అందులో వకాయన. ఎందుకు దొరకదండీ? అసలు వీళ్ళకోసం ఒక ఇల్లు చూసిపెట్టాను. వీళ్ళు నాదగ్గరికి అసలు రాకపోయేసరికి వద్దని చెప్పేశాను అని ఇంకోఆయన సమాధానం ఇచ్చాడు. మాకు చూడమంటే ఇంకా చూస్తూనేవున్నారు కాదా ఎక్కడోవున్నట్టు చెప్తారేమిటీ ఖబుర్లు అని కొద్దిగా కసిరాడు. మీకు ఏ ఇల్లు చూపించినా నచ్చదాయె అందుకే మీకు ఇల్లు దొరకటంలేదు. ఆమధ్య మీరు చూసిన ఇల్లు వీళ్ళు ఇద్దరే కనక సరిపోతుంది. చూపించి ఇది మీకు బాగుంటుందేమో, చూడండి అంటూ వో సలహా పడేశాడు. రాఘవరావు ఆ సంభాషణ మార్చుకోవాలని, ఆయనకి నచ్చని ఇల్లు

మా కెందుకండీ ? పైగా మేము ఇంతకంటే మంచిఇల్లు అయితే తప్ప అసలు ఖాళీ చెయ్యమని తేల్చి చెప్పేశాడు.

అది సరే అనుకోండి. ఆ ఇంటికి మార్కెట్టు పక్కనే వుంది. ఎక్కడికి కెళ్ళాలన్నా ఐదుపయ్యాపైసలు టిక్కెట్టు. అన్ని బస్సులూ అక్కడే బయలుదేరటం. మనవాళ్లు నలుగురూ కన పడతారు, అంటూ రెండో ఆయన చెప్పివొప్పించేందుకు ప్రయ త్నించాడు. అబ్బే, అటువంటి సౌకర్యాలతో అంతపని లేదు మాకు. మా ఆవిడకి అట్టే ఎక్కడికీ వెళ్ళే అలవాటులేదు. కూరగాయలు ఇప్పుడు ఇంటికే వస్తున్నాయి. నాకు బస్సుల దగ్గర కాచుకు నిల్చునే వోపిక లేదు చెప్పద్దూ అంటూ రాఘవరావు అనేశాడు.

ప్లేట్లు మళ్ళా నింపుకుంటూ ఈవూళ్లో ఎవరూ ఇంటిని అంటుకూర్చోరమ్మా, సాయంకాలం అయ్యేసరికి ఆడవాళ్లు ఎంతో ముచ్చటగా బైటకి వెడతారు. మా ఇళ్ళల్లో కూడా అంతా వెడతారు అంటూ నాగరికత లక్షణం బయట పెట్టాడు మొదటి ఆయన. మనవాళ్లంటే ఈ భాషకి అలవాటు పడ్డారు, ఎక్కడికెళ్ళినా నెగ్గుకురాగలరంటూ ఇంకోఆయన వాళ్ళ ఘనత చెప్పాడు. అంతా వెళ్లేందుకు సిద్ధపడి వాళ్ల ఇల్లు ఎక్కడ వున్నాయో చెప్పి, తెలుసుకోవటం ఏమీ కష్టంవుండదు, ఆ వీధిలో ఎవర్ని అడిగినా చెప్తారు అని మళ్లా ఇంకోసారి ప్రతిభ బయట పెట్టుకున్నారు. వాళ్లనిపంపి, రాఘవరావు తలుపు వేసు కుని మధ్యాహ్నం పట్టుకున్నారు అంటూ పద్మతో చెప్పి నవ్వు కున్నాడు.

వాళ్ళవరస నాకేం నచ్చలేదు. వో మూల ఇల్లు చూసి వుసూరుమంటూనే ఆ ఇల్లుచూడండి ఈ ఇల్లు చూడండి అని సలహా ఏమిటి ? ఏదో చెత్త కొంపమనకిచూపించి ఈఇల్లు వాళ్లు పుచ్చుకోవాలని కాబోలు. మీరు మాత్రం ఈ రకంవాళ్ళని పిల్చుకరాకండి బాబూ అంటూ విసుక్కుంది పద్మ.

ఓసి పిచ్చదానా వాళ్లు చెప్పినంతమాత్రాన మనం ఎల్లాగూ మారేది లేనప్పుడు బెంగ ఎందుకు ? అప్పుడప్పుడు నలుగురితో కలుస్తూవుండాలి, మనుష్యులికి దూరంగా వుండేం దుకు ప్రయత్నించకూడదు అంటూ పద్మకి బోధించాడు రాఘవరావు. మళ్ళీ కొన్నాళ్లు నిశ్చింతగా కాలం జరిగింది. రాఘవరావు అఫీసుకు వెళ్లాక పద్మపనులు పూర్తిచేసుకు పడు కునే ప్రయత్నంతో, వేసిన ఘడియలే మళ్ళీ చూసుకునేందుకు ముందుగదిలోకి వెళ్ళింది. కిటికీదగ్గర నాలుగుతలలు వకరికంటే వకరు ముందుకు వంచుతూ తొంగి చూడటం చూసి, ఎవరో అర్థంకాక తెల్లపోయి చూస్తూవుండిపోయింది పద్మ. అందులో వెనకనిల్చున్న ఆవిడ కంఠము సవరించుకుంటూ రాఘవరావు గారు వున్నారా ? అని అడిగింది.

లేరంటూ పద్మతల అడ్డంగా తిప్పివూరుకుంది. అందులో పళ్లు ఎత్తావిడ పెదిమముందుకీ వెనక్కీ జరుపుకుంటూ, తలుపు తెరవటమే తడువుగా అంతాలోపల సోఫాల్లో విశాలంగా జార్ల పడుతూ కూలపడి, అబ్బా ఎంతవుక్కగా వుందండీ అంటూ జాకెట్లలోకి వూదుకుంటూ పైకి ఫేనుకోసం చూస్తున్నారు. పద్మకి ఫేను పెట్టాలని లేకపోయినా తను పెట్టకపోయినా వాళ్లే పెట్టుకునేట్టున్నారు అనుకుంటూ స్విచ్ వేసింది.

పళ్లువెత్తు ఆవిడ జరిగిన పమిటని పూర్తిగాతీసి మళ్లా వేసుకుంటూ, మనము ఎవరమో ఆవిడకి తెలిసినట్టు లేదు. మీరు చెపుతారా నన్ను చెప్పమంటారా, అని పెద్ద జరీ చీర కట్టుకున్న మెల్లకన్ను ఆవిడని అడిగింది. జరీఅంచు సవరించు కుంటూ ఈపాటికి ఆవిడ గ్రహించే వుండవొచ్చు. ఆ మధ్య మీవారు బలవంతంగా మావారిని, వాళ్ళ వాళ్ళని తీసుకొచ్చారుట అంటూ మెల్లకన్నుని వయ్యారంగా తిప్పుతూ పెదిమలు తడుపుకుంటూ పద్మకళ్ళల్లోకి చూసింది. వచ్చే ఆవలింతల్ని చిటికెలతో ఆపుతూ, ఆమధ్య ఎవరో రావటం వచ్చారు. అంత వివరంగా ఎవరు ఎవరో తెలుసుకోలేదు. అన్న పద్మ సమాధానం విని వచ్చినవాళ్ళు వకర్ని వకరు చూసుకున్నారు.

అప్పటిదాకా మాట్లాడకుండా నాజూగ్గా సోఫాకిఅతుక్కు కూర్చున్న ఆవిడ ముందుకు వంగి చెంపముంగురులు ఎక్కడ అతుక్కున్నాయో అని చేత్తో రేపుకుంటూ కొద్దిగా నవ్వు మొహంలోకి తెచ్చుకుని కులుకుతూ, ఆరోజు వచ్చిన ఆఫీసరు గారి భార్య ఆవిడే అంటూ జరీచీర ఆవిడ కేసి చూపించి, మేము ఇక్కడికని రాలేదు. మాతో హిందీ చదివే అమ్మాయి ఈ పక్కవీధిలో వుందిలెండి. ఆవిడ టీకి పిలిస్తే వచ్చాము. అక్కడ దాకా వచ్చాముకదా మీ ఇల్లు చూసి పోదామని వచ్చాము అంటూపూర్తి చేసి స్థూపిరిగట్టిగా తీసుకుంటూ మళ్ళా వెనక్కి చేరింది. జరీచీర ఆవిడ అంతకుముందు కళ్లు తిప్పటం, మూతి తిప్పటమే జరిగింది. ఇహ తలకూడా వోలయగా వూపుతూ మీరు ఎప్పుడు ఖాళీచేసేదీ చెపితే మేము ఎల్లాగో సర్దుకు వుం

డేందుకు ప్రయత్నిస్తాము అని పద్మకి చెప్పి, కొంగుజరీ నడుం చుట్టూ సరిచేసుకుంటోంది.

అబ్బే మేము ఎవరితోటీ ఖాళీచేస్తామని, ఖాళీ చెయ్యాలనుకుంటున్నామని కానీ అనలేదే అని పద్మ చెప్పటం విని గుండ్రంగా పచ్చగావున్న ఆవిడ ఎర్రజా కెట్టు పక్కన వంటిమెరుపు వారకంటచూసుకుంటూ, మీరన్నారని మేము మాత్రం అన్నామా? మిమ్మల్ని నలుగురులోకి తీసుకెళ్లాలని మా వుబలాటం. మా ఇంటిపక్కన మేడమీద రెండు గదులూ వరండావుంది. చాలా బాగుంది. మీ ఇద్దరే కనక హాయిగా వుండవచ్చు. మా వారు అప్పుడే ఇంటివాడితో మాట్లాడేశారు కూడాను అంటూ విశదంచేసింది. ఈ సారి పద్మకి కోపం నిజంగానేవచ్చింది.

మీ వారుపాపం ఎందుకు అంత శ్రమపడుతున్నారో మరి! మాకైతే ఇల్లు అక్ఖర్లేదు. పోనీ వాళ్ళని వుండమనరాదూ? అని జరీచీర ఆవిడని చూపించింది పద్మ. సరే వాళ్లకి చాలదు కనక నే మిమ్మల్ని అందులోకి మార్చటం అంటూ బైటపెట్టింది గుండ్రటి ఆవిడ.

అదేమన్న మాటండీ! వాళ్ళకోసం వీళ్లకి చెప్పామా అంటూ కళ్లతో బెదిరించింది నాజూగ్గావున్నాననుకునే ఆవిడ. ఇంకెందుకూ వెడదాము పదండి అంటూ జరీచీర ఆవిడ విసురుగా లేచినిల్చుంది. పద్మలోపలి కెళ్లటంతో అందరికళ్లూ మూతులూ సైగలతో తిప్పుకుంటూ తీర్మానించుకోవటం పక్క గదిలోంచి చూసింది పద్మ. కాఫీ కప్పులు బల్లమీద పెట్టడంతోనే చెప్పకుండా తీసుకున్నారు అంతా. మళ్లీ ఏం మాట్లాడేందుకూ తోచనట్టు అటూఇటూ చూసి, పళ్లు ఎత్తు ఆవిడ

ఆరంభించింది. ఈ పక్క వీధిలో వో తెలుగు కుటుంబం వుంది కానీ ఆవిడతో ఆట్టేపెట్టుకోకండి నోరుమంచిదికాదు. అయినా నేను చెప్పివుండకూడదేమో అనుకుంటూ కొంగుతో మూతి తుడుచుకుని వెనక్కి జరిగి కూర్చుంది.

పాపం ఆవిడకి అట్టేఎక్కడికి వెళ్లటం అలవాటే లేదుటలే, వాళ్లవారు చెప్పుకుబాధ పడ్డారుట, అంటూ పెదిమలు తడుపుకుంటూ నాజూగ్గావున్న ఆవిడ పద్మమీద సానుభూతి ప్రకటించింది. వాళ్లగొడవ మనకెందుకు లెద్దురూ మనంవచ్చిన పని కానేలేదు. మీరుఎప్పుడూ ఇలాంటివే చెపుతారు అంటూ జరీచీర ఆవిడ గట్టిగానే కసిరింది మిగిలిన వాళ్లని.

బయలుదేరిన వాళ్లకి పనిమనిషి మెట్లదగ్గర ఎదురవటంతో వాళ్ల బాషా పాండిత్య ప్రదర్శన మొదలు పెట్టిదానికి ఏం చెప్పారో ఆ ఫలితంగా ఆ మర్నాటినించీ అదిచేసేపని తగ్గించిటీ ఇంకా కలపలేదా అని అడగటం దగ్గరికి వచ్చింది. రాఘవరావు పద్మ బజారు సరుకులకని బయలుదేరటం, అదేమొదలు కావటంచేత అక్కడకొన్నీ, ఇక్కడకొన్నీ కొనుక్కు ఇంటికి బయలుదేరుతూ అక్కడ వాళ్లని గురించి మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వెళ్లటం, వెనకవచ్చే ఆవిడకి కూడా నవ్వు వచ్చి ఎక్కడ వుంటున్నారేమిటి మీరు అంటూ పద్మవీపుతట్టి అడిగింది. సామాన్లు టాక్సీలో పెడుతూ పద్మ సమాధానం ఇచ్చింది.

ఆవిడ తమ ఇల్లుకూడా ఆ ప్రాంతంలోనే వుందనిచెప్పి, ఎప్పుడయినా రమ్మని వెళ్లిపోయింది.

ఆ రోజు రాఘవరావు ఆఫీసుకి వెళ్లకమునుపే పద్మ కడుపునెప్పి, జ్వరంతో మూలుగుతోంది. రాఘవరావు

తొందరగా వచ్చేస్తానని చెప్పి ఆఫీసుకి వెళ్లాడు. వెళ్లినదగ్గరనించీ పద్మకి వాంతులు పట్టుకున్నాయి. మనస్సు పరిపరి విధాల పోతోంది. చాలానీరసంగా మూలుగుతూ సాయంత్రం దాకా తను బతికి వుండ నేమోనన్న అనుమానంతో పద్మకి ఏడుపు ఆగటంలేదు. వీధితలుపుచప్పుడు అవటం వినపడింది. నెమ్మదిగా వెళ్లి తలుపు తెరచి అక్కడే కింద కూలపడి నిస్సహాయంగా చూస్తోంది పద్మ. ఆరోజు టాక్సీస్టాండులో చూసినఆవిడ వెతుక్కుంటూ వచ్చింది. పద్మని పలకరించి, అయ్యో మేము ఇంత దగ్గరలో వున్నాంకదా ? ఓ మాటచెప్పి పంపితే ఏం? అంటూ తలుపులేసి పద్మని తీసుకెళ్లింది.

రాఘవరావు వచ్చేసరికి పద్మకి పర్యలుచేస్తున్నావిడని చూసి ముందుగుర్తుపట్టలేదు. సమయానికి దేవతలా వచ్చారు ఆవిడ అంటూ నీరసంగా మొదలు పెట్టింది వుపోద్ఘాతం పద్మ రాఘవరావుతో.

సరేలెండి ఇప్పుడుకాదు మీరు చెప్పాల్సింది అంటూ ఆవిడ మందలించి రాఘవరావుకి మందులు ఎప్పుడు ఇవ్వాలో చెప్పి అవసరమవుతే తన్ని పిలవమని చెప్పివెళ్లిపోయింది.

పద్మ రెండురోజుల్లో తేరుకుంది. ఆవిడ రోజుకి రెండు మూడుసార్లు వచ్చి కనుక్కుంటూ కావల్సినవన్నీ అమరుస్తూ చాలా సన్నిహితురాలయింది. పనిమనిషికి కూడా నచ్చచెప్పి అన్నీ చేసేటట్టు చేసింది. పద్మ మనసులోనే ఎన్నోసార్లు కృతజ్ఞత తెల్పుకుంది.

రాఘవరావు మొదట వున్నంత చనువుగా ఆవిడతో వుంటంలేదు. పైగా వకటి రెండుసార్లు ఆవిడని విమర్శిస్తూ

మాట్లాడ్డం పద్మకి కష్టంగా తోచింది. ఆవిడ ఇప్పుడు రావటం తగ్గించింది. ఒకరోజు రాఘవరావు మొదట్లో వచ్చిన వాళ్లల్లో ఇద్దర్ని వెంటపెట్టుకు వచ్చాడు.

పద్మనిపిల్చి నువ్వు ఆవిడనుగురించి ఎంతమంచిగా చెపుతున్నావో, అంత చెడ్డదిట ఆవిడ అంటూ లోపలికి వెళ్లాడు.

అబ్బె వట్టి చండాలంమనిషి అండీ. ధర్మరాజులాంటిభర్త. ఆయన్ని పెట్టే తిప్పలు, ఇన్నీ అన్నీ కావనుకోండి. అత్తా మామా వున్నారు వాళ్లని గడప తొక్కనివ్వదు. అని ముక్కుపొడుం పీలుస్తూ చెప్పాడు బొల్డు తల ఆయన.

ప్రతి ఇంట్లో ఏదో గొడవలు వుంటూనే వుంటాయి. వాళ్ల సంసారం గొడవ మనకెందుకులెండి. మేముఎవరో ఏమో తెలీకపోయినా నిజంగా సొంత వాళ్లకంటే ఎక్కువగా చేసింది నాకు. ఆరోజు ఆవిడ రాకపోతే ఏమయ్యేదాన్నో అంటూపద్మ చెప్పింది.

అదే ఇప్పుడు చెప్పేది మేము. చేస్తుంది ఏంలాభం? గొప్పకోసం మీాఇద్దర్ని గురించీ ఇన్ని చెపుతోంది. వినలేక పోయాననుకోండి అంటూ రెండో అతను వంతపాట మొదలు పెట్టాడు.

రాఘవరావు అక్కడికి రావటంతో రెండో అతను కంఠము పెద్దదిచేసి చెప్పటం మొదలుపెట్టాడు. మీారు చాకిరీ చేయించుకుని కృతజ్ఞతకూడా చెప్పలేదుట. ఒకటేమిటి ఎందుకు లెండి అవిఅన్నీను అంటూ నసగటం మొదలుపెట్టాడు. నిజమే. మాది ఆవిషయంలో తప్పే. మేము వెళ్లి చెప్పి వుండాల్సింది అని పద్మ నొచ్చుకోవటంతో ఇంక ఆ సంభాషణ పెరగలేదు.

కడుపునిండాక పద్మతో కూడా వెడతామనిచెప్పి మీరు ఇంతదూరంగా వుంటే ఇల్లాంటి ఇబ్బందులు వుంటూనే వుంటాయి. మా పేటలో వుంటే ఎవరో వకరు మీ ఇంట్లో నే వుండేవారు. ఇప్పుడైనా మించిపోయింది లేదనుకోండి. ఏదయినా ఖాళీఅవగానే వద్దురుగాని అన్నాడు మొదటిఆయన.

పద్మ అప్రయత్నంగా ఆఫీసరుకి ఇల్లు దొరికిందా అని అడిగింది. ఆప్రశ్నకి ఇద్దరిదగ్గరనించి వెంటనే జవాబురాలేదు. కొంతసేపయ్యాక తేరుకుని ఆవిడ చెప్పిందేమిటి ? వాళ్ళకోసం ఈ ఇల్లు మిమ్మల్ని మారమంటున్నామా అని ఇద్దరూ వక్కసారి పద్మని అడిగారు.

అబ్బే ఆవిడేం చెప్పలేదు, పైగామీరు వచ్చినట్టు నేను చెప్పలేదుగా ? అంది పద్మ. రైటు ఆవిడదగ్గర అల్లాగే వుండాలి లేకపోతే బతకనివ్వదు. అసలు నాపేరు చెపితే ఈ చుట్టుపక్కలికిరాదు. ఈసారి చెప్పిచూడండి మీకే తెలుస్తుంది అని రెండో అతను పర్సు చేతులుముందుకీ వెనక్కీ జరుపుకున్నాడు.

వాళ్లు వెళ్లాక పద్మకి ఏమిటి ! వీళ్లుచెప్పింది నిజమేనా! అన్న అనుమానం మొదలయింది. రాఘవరావు నిశ్చింతగా ఈజీ ఛైరులో కూర్చుని పుస్తకం తిరగేస్తున్నాడు. పద్మ మాటలు మొదలుపెట్టింది. వీళ్లుచెప్పింది నిజమంటారా? ఏమో? అన్నట్టు పెదిమ విరిచాడు రాఘవరావు. మాట మారుస్తూ నా కోటు జేబులో వుత్తరాలు వున్నాయి పట్టుకురా అని చెప్పాడు.

పద్మ ఉత్తరాలు చదువుతూ మళ్ళా ఇంత తొందర్లో బదిలీయా ? అని ఆశ్చర్యంగా మొహం పెట్టింది. ఏం ? నీకు ఇష్టంలేదా అని అడిగాడు రాఘవరావు. ఎవరికీ చెప్పక ఇంటి

కోసం ప్రాణంతీస్తారు. ఆ వచ్చే అతనికి ఇస్తేనే మనకి అక్కడ ఇబ్బంది వుండదు అంటూ మళ్లీ పుస్తకం పేజీలు తిప్పుతు న్నాడు. మర్నాడు రాఘవరావు ఆఫీసుకు వెళ్లగానే పద్మ పని పూర్తిచేసుకు పక్కవీధిలో ఆవిడ ఇంటికి వెళ్ళింది. ఆవిడ చూసినా చూడనట్టు వూరుకోవడంచూసి పద్మ మనస్సు చిన్న పుచ్చుకున్నా, తనే పలకరించి మీరు చేసిన సాయం ఎప్పుడూ మరవలేను అంటూ కృతజ్ఞత చెప్పి, వెడతానని బయలుదేరింది.

ఏదో వంటరిగా అవస్తపడుతూంటే చూడలేక వచ్చా తప్ప నాకేదో మీ దగ్గరనించి వచ్చి వరుగుతుందని రాలేదు. అయినా తెనుగువాళ్ళతో ఎప్పటికప్పుడు పెట్టుకోకూడదనుకుం టూనే వుంటా నంటూ ఆవిడ స్వగతంగా చెప్పింది.

మీకు ఏదైనా మాలో లోపం కనపడితే క్షమించండి. మిమ్మల్ని గురించి మంచిగా అనుకున్నామేగాని పొరపాటు మాట ఏమి అనలేదే అని పద్మ చెప్పి వెడతానని బయలు దేరింది.

అనకపోవడం ఏమిటి లెండి ? వాళ్లు మీ యింటినించి తిన్నగా యిక్కడికే వచ్చారు. మీవారికి ఇష్టం లేకపోయినా నేను రోజూ వచ్చేదాన్నని, మీ ఇంట్లో బాగున్న వస్తువులన్నీ కావాలన్నానని ఇంకా ఏవేవో చెప్పారనుకోండి అన్నీ చెప్ప డం ఎందుకు అని వూరుకున్నా అంటూ ఆవిడ బైట పెట్టింది.

నేను అనుకుంటూనేవున్నా వాళ్లు ఇల్లా తంపులుపెట్టే రకమేనని. వచ్చినప్పటినించీ మా ఇల్లు ఎవరికో ఇవ్వమనటం మమ్మల్ని ఇంకో ఇంటికి మారమని ఆడామొగా రకరకాలుగా ఆపేక్ష వలకపొయ్యటం మాకు ఎక్కడో చుట్టరికం వుం

దంటూ అందరిదగ్గరా లేని వన్నీ చెప్పటం ఆ మాటకి వస్తే మిమ్మల్ని గురించి చెడ్డగా చెప్పింది వాళ్లేగా ? ఎందుకులెండి గొడవ, మాకు మళ్ళీ మేము ఇదివరకు వున్న వూరే బదిలీ అయింది అని చెప్పి పద్మ ఇంటికి బయలుదేరింది.

మేడమెట్లు ఎక్కుతూంటే పైన వరండాలో ఎవరివో మాటలు వినపడ్డాయి. ఎవరొచ్చివుంటారా ? అనుకుంటూ తొందరగా పైకి వెళ్లింది పద్మ. మొదట వచ్చిన ఆడవాళ్లు నలుగురూ నిల్చుని నవ్వు మొహంలోకి తెచ్చుకుంటూ మీ కోసమే ఎదురుచూస్తున్నాము! ఎక్కడికెళ్లారు? అని పద్మని ప్రశ్నలు మొదలెట్టారు. సమాధానం చెప్పకుండానే తలుపులు తీసుకు లోపలి కెళ్లింది.

వకళ్ళ మొహంలోకి వకళ్ళు చూసుకుంటూ లోపలికి వచ్చి సోఫాలో కూర్చుంటూ అల్లా వున్నారేమి, వంట్లో బాగా లేదా? అని నాజూగ్గావున్నావిడ పద్మ నడిగింది. సమాధానంగా చిన్నగా నవ్వి వూరుకుంది. మెల్లకన్ను ఆవిడ పమిట జారుతూంటే కూడా గమనించుకోకుండా చేతులు తిప్పుతూ, ఈసారి మీమాట నిలబెట్టుకోక పోయారంటే చూసుకోండి ఏంచేస్తానో, వ్యంగ్యంగా అంటూ నాజూకుగా వున్నావిడ కేసి వోకన్ను పెట్టి చిత్రంగా నవ్వింది.

మళ్లా వాళ్లు ఇంటికోసమే వచ్చారని అర్థమయ్యేందుకు అట్టేసేపు పట్టలేదు పద్మకి. ఇంకో ఆవిడ ఆ మాటని మరపించేందుకు, ఏమిటండి, మీరు పూర్తిగా పరిచయం కాకుండానే మళ్ళా వెళ్లిపోతున్నారుట ? ఆమాట విన్నదగ్గరనించీ ఏమీ తోచటంలేదు చెప్పొద్దూ ? అంటూ విచారం వెళ్ళబెట్టింది.

మెల్లకన్ను ఆవిడ పమిట అంచులు సరిచేసుకుంటూ, మధ్య మీకెందుకు విచారం? సర్వీసు అన్నాక ఎక్కడికి వేస్తే అక్కడికి వెళ్ళాల్సిందే. ఎప్పుడు వెడుతున్నారు? అని పద్మ నడిగింది. నాలుగురోజుల్లో వెడతామని ముభావంగా చెప్పింది పద్మ.

అయితే ఇల్లుమాత్రం ఎవరికీ మాట ఇవ్వకండి మేమే తీసుకుంటాము. రేపు మంచిదికనక కొంతసామాను తెచ్చి పెట్టు కుంటాము. మీరు వోగది మాత్రం ఖాళీ చెయ్యండి అంది.

అది మాత్రం వీలు పడదులెండి. మా సామాన్లు సర్దు కునేందుకె చోటు చాలదు, అన్నీ విప్పి పెడితే. అయినా మీకు ఇస్తాడని నమ్మకమేమిటి? ఈ ఇంటాయన బంధువులెవరో వస్తారట అంటూ మెల్లిగా బయట పెట్టింది పద్మ.

అందుకేగా సామాను ముందుగా తెచ్చి పెట్టటం. ఇవ్వకేం చేస్తాడు? వాళ్ళకి ఇంకోపది ఎక్కువ పారేశామంటే ఇంక మాట్లాడ్డు అంటూ అప్పుడే తనదయినట్లు గర్వంగా తల తిప్పుతూ సమాధానమిచ్చింది మెల్లకన్ను ఆవిడ.

మీకు సామాను సర్దటానికి తోడురమ్మంటే మేము వస్తాము అంటూ నాజూగ్గా వున్నావిడ, పద్మని ప్రసన్నం చేసు కునేందుకు అడిగింది. ఎవరూ అక్కర్లేదండి. మాట్లాడ్డం అయింది వాళ్లేసర్ది సామాన్లు ఎక్కిస్తారుట.

మీకు ఆమధ్య సుస్తీచేసిందటగా! మాకు ఎవరికీ తెలి యనే తెలీదు మీ పక్కవీధిలో వున్నావిడ వచ్చి చెప్పేదాకా అంటూ గుండ్రటిపాటిఆవిడ పద్మతో అంది.

చేసింది ఏమన్నా వూరుకుంటుందా? ఇంటింటికీ వచ్చి చెప్పేమాటలు వినలేకపోయాం బాబూ! **ఆవిడ** చేస్తోందికదా అని మీరు అన్నీ మంచంలోనే జరపమన్నారట కదూ? **మీ** వారేమో ఆవిడ వెంట కూడా కూడా రాసుకుతిరగటం, **ఆవిడ** కాఫీ ఇస్తోంటే చేతిని గట్టిగా నొక్కారని, పైగా **మావారి** తోటి చెప్పటం. సిగ్గులేని మనిషి. ఆయన వకటే నొచ్చుకున్నారు. చెప్పొద్దూ అంటూ నాజూగ్గావున్నావిడ సానుభూతిగా మూతి పొడుగ్గా పెట్టుకుంది.

పక్కవీధి ఆవిడ అంతవిగ్రహం ఎప్పుడు వచ్చిందో కూడా తెలియలేదు. ఏమిటీ మళ్ళా చెప్పు అంటూ రెట్టిస్తూ లోపలికివచ్చే దూకుడుచూసి అందరూ తెల్లబోయి చూస్తూ వుండిపోయారు.

నేను చెప్పానని చెప్పాడా? పనికట్టుకు మీ ఆయన వచ్చి, వాళ్ళఇంటికి ఎందుకు వెళ్లావు? ఆయన సంగతి తెలీనట్టు వుంది నీకు. ఆడవాళ్లని చూస్తే వదలడంటూ వాగి, పైగా నేను అన్నానంటాడా? నేను అడక్కుండానే వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు అన్నీ చెప్పింది ఎవరో? కనపడనీ అడుగుతా వదులుతాననుకోకు, నువ్వేదో అంటున్నావే, సిగ్గులేంది నువ్వా నేనా? అవసరాలు వుంటే గడపవదలకుండా తిరిగేది ఎవరో గుర్తుతెచ్చుకో అంది.

నువ్వు చేసిందేమిటో మహాచెబుదూ, నీ నోటికి జడిసే మీ వీధికి రావాలంటేనే భయంపట్టుకుంది. నువ్వు చెప్పకపోతే ఎల్లా తెల్సిందేమిటి? వాళ్ల ఆయన చెయ్యిపట్టుకున్నట్టు

అంటూ నాజూకు ఆవిడ వోకంట పద్మనిచూస్తూ పక్కవీధి ఆవిడకి సమాధానం చెప్పింది.

మీ ఆయన చెప్పినమాటలు విన్నాక నిజమేనేమోనని జరిగినది చెప్పాను, మీలా అబద్ధాలు చెప్పను చస్తే. తెలిసిందా? అంటూ ఆయాసాన్ని అణుచుకుంటూ పక్కవీధి ఆవిడ పై స్థాయిలో సమాధానం ఇచ్చింది.

మెల్లకన్ను ఆవిడ కళ్లు తేలవేస్తూ వెనక్కి జార్లపడి వొంగ్రడింపు మొదలుపెట్టటంతో అంతా ఆవిడచుట్టూ నిల్చుని ఫిట్టు వచ్చిందంటూ వుపచారాలు మొదలుపెట్టారు.

ఇంటి యజమాని కొన్ని సంచులు డబ్బాలు బుట్టలూ తెచ్చి మధ్యగా పెట్టి అలమార్లు ఖాళీచేస్తే పెట్టుకుంటానని పద్మతో అనటంవిని అంతా పక్కసారి వాళ్ల సామాను సర్దుకోకుండా మీరు అడ్డుపెట్టడం ఏమిబాగుంటుందని అటకాయించారు.

నేను రావుతో ముందే చెప్పాను. పెట్టుకోమంటేనే తెచ్చానంటూ వో అలమారు ఖాళీగావుంటే దాంట్లో అన్నీ సర్దుకుంటున్నాడు ఇంటిఅతను. అదేమిటండీ ఎవరైనా ఈ వూళ్లో ఇంటివాడి చేతికి ఇల్లు వప్పగిస్తారా? మనవాళ్ళకి ఇచ్చుకునే వాళ్ళంగా? వాడు పగిడీలేందే మళ్లీ చచ్చినా ఇవ్వడు అంటూ సన్నపాటి ఆవిడ గట్టిగా కసిరింది పద్మని.

వాళ్ళు ఎల్లాంటి వాళ్ళయినా మనంచేసేది చెయ్యాలి కానీ ఇల్లా తెలివితక్కువగా ఇంటివాడికి వదిలారు ఏమిటి? అని పక్కవీధి ఆవిడ పద్మని కొద్దిగా మందలించింది.

వాళ్ళంతా వకటిఅవటం పద్మకి ఆశ్చర్యాన్ని కలిగించి బిత్తరపోయి చూస్తోంది. అసలు వాళ్ళకి ఎందుకు ఇవ్వాలి ఇల్లు?

అడగాలనుకుంది. రాఘవరావు రాకతో ఆ ప్రస్తావన ఆపి ఇంటి యజమాని సామాను తెచ్చుకున్నాడని చెప్పింది. మంచిపని చేశాడు. మనకి బాధతీరింది. ఎవరికి ఇప్పించినా నిష్ఠూరమే అంటూ లోపలికి వెళ్లాడు.

ఈ కొంపకోసం ఎన్నిసార్లు ఈ గడప తొక్కాల్సి వచ్చింది. చిన్నదశలోంచి పైకివస్తే ఇల్లాంటిబుద్ధులే వుంటాయి. మావారిలాంటి వాళ్లు ఎక్కడో కానీ వుండరు. లేకపోతే కింద వాళ్ళతో ఇంతచనువుగా ఎవరుంటారు? అప్పుడే తెలివితెచ్చుకున్న ఆఫీసరుగారి మెల్లకన్ను భార్య నీరసంగానిర్వచనం చేసింది.

ఏమండోయి, మీవారిపదవికి జడిసి మీతో రావటం లేదు. ఏదో సాటివాళ్లు ఇంటికోసం అవస్థపడుతున్నారనితప్ప అంటూ గుండ్రపాటి ఆవిడ పౌరుషపడింది. వాళ్ళు ఘర్షణపడుతూనే మెట్లు దిగుతున్నారు.

మీరు పక్కవీధిఆవిడ చెయ్యి పట్టుకున్నారని చెప్పిందిట అని పద్మ రాఘవరావుకి చెప్పింది. హతోస్మి ఆంజనేయదండకం చదువు అంటూ రాఘవరావు మెట్లదగ్గరకు వెళ్ళాడు. మెట్ల పైన నిల్చున్న పక్కవీధి ఆవిడ రుసరుసలాడుతూ రాఘవరావు కేసిచూసి చరచరా దిగి వెళ్ళిపోయింది.

అంతా వకరకం సజ్జులాగే వున్నారు. కొంగుతో మొహం తుడుచుకుంటూ మాటలోన్నా కాస్త వుపకారబుద్ధి వుంది. ఈ పక్కవీధి ఆవిడ వాళ్ళకంటే వెయ్యిరెట్లు నయం అనుకుంటూ అంది పద్మ. "స్త్రీ బుద్ధిహిః — తరవాత ఏమిటి?" రాఘవరావు నవ్వాడు.